క్లుప్తంగా

కంట్రోల్ రూమ్ తనిఖీ

భద్రాచలంటౌన్: గోదావరి వరద ముంపు గ్రామాల ప్రజలకు గోదావరి వరదకు సంబంధించిన హెచ్చరికలను తెలియజేయడానికి ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ పని తీరును డీఎస్‌ఓ ప్రభాకర్ రావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదావరి వరదలకు సంబంధించిన కంట్రోల్ రూమ్‌కు వరదల హెచ్చు, తగ్గుల వివరాలు తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. సిబ్బంది ప్రతీ వారి ఫోన్ నంబరు, సమయము, పేర్లు, గ్రామము, మండలం, జిల్లా తప్పనిసరిగా రిజిస్టర్లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజశేఖర్, భాస్కర్, శ్రీనివాస్, బుచ్చిబాబు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు పరిశీలన

భద్రాచలంటౌన్: భద్రాచలం కునవరం రోడ్‌లో నూతనంగా నిర్మిస్తున్న కరకట్ట పనులను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ మంగళవారం పరిశీలించారు. గోదావరికి వరద పెరుగుతున్నందున పనులు తాత్కాలికంగా ఆపేసి వరద నీరు పట్టణంలోని రాకుండా ప్రధాన రహదారిపై ఇసుక బస్తాలతో మూసివేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో నాయకులు కొండిశెట్టి కృష్ణమూర్తి, అరికెల తిరుపతిరావు, ఎండి.నవాబ్, నర్రా రాము, భీమవరపు వెంకటరెడ్డి, పుల్లగిరి నాగేంద్ర, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల మరమ్మతులు

ములకలపల్లి: గుంతలతో నిండి ప్రమాదకరంగా మారిన బీటీ రోడ్డుకు పోలీసులు తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. పాల్వంచ- మండలపల్లి బీటీ రోడ్డు గంగారం అటవీప్రాంతంలో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల వర్షాలకు గుంతల్లో నీళ్ల నిండి, ఈదారిలో ప్రయాణమే ప్రమాదకరంగా మారింది. సోమవారం రాత్రి గుంతలోదిగి ఓ కారు ప్రమాదానికి గురికాగా, ప్రయాణీకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీంతో ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయించారు. గుంతల్లో సిమెంట్, కాంక్రీట్‌తో వెట్‌మిక్సర్ వేయించి, గుంతలను పూడ్చించారు.

వరద బాధితులకు వితరణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్టు వరద ముంపు బాధిత కుటుంబాలకు అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు వితరణ అందజేశారు. మంగళవారం ఆయన గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాల్లో పర్యటించి ముంపు బాధితులను పరామర్శించి, ఇసుక మేటలతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాలకు చెందిన 61 మంది ముంపు బాధిత కుటుంబాలకు రూ.91,500 విలువైన బియ్యం , నిత్యవసరాలను పంపిణీ చేశారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని, కరెంట్ షాక్‌కు గురై మృతి చెందిన చాపర్ల వేణు మురళి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, మాజీ జెడ్పీటీసీ జేకేవీ రమణారావు, నాయకులు మోహన్‌రెడ్డి, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యపై వినతి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీలో భారీ యంత్రాల మడ్ క్లీనింగ్ కాంట్రాక్ట్ పనులలో పరిమితికి మించి వర్కర్లను నియమించొద్దని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో మంగళవారం పీకేఓసీ ప్రాజెక్ట్ ఇంజనీర్ జె.వీరభద్రుడుకి ప్రాజెక్ట్ కార్యాలయంలో సంతకాల సేకరణతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డి.నాసర్‌పాషా మాట్లాడారు. ట్రాక్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులు నివాస్, డేగల ప్రవీణ్, దాసు, పెదరాజు, ప్రదీప్, ఉప్పయ్య, చిన్నరాజు, ఇజ్రాయిల్, శ్రీను, విజయ్, సారయ్య, శ్రీకాంత్, జనార్దన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో వివక్ష

భద్రాచలంఅర్బన్: కేంద్ర ప్రవేశ పెట్టిన యూనియన్ బడ్జెట్‌లో తెలంగాణా రాష్ట్రాన్ని ఏ మాత్రం పరిగణలోనికి తీసుకోలేదని, కేంద్ర వివక్షతతోనే ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని సీపీఎం భద్రాచలం నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బడ్జెట్‌లో భద్రాచలం కొవ్వూరు రైల్వే లైన్ ఊసు లేకపోవడం దారుణమని అన్నారు.

మణుగూరురూరల్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణాకు తీరని అన్యాయం జరిగిందని ఎంపీటీసీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, కూనవరం ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణాలో బీజేపీ మంత్రులు ఉన్నా రాష్ట్రానికి బడ్జెట్ కేటాయించడంలో విఫలం చెందారన్నారు.

ర్యాపిడ్ ఫీవర్ సర్వే

చర్లరూరల్: మండలంలోని కొయ్యూరు, సత్యనారాయణపురం పీహెచ్‌సీల పరిధిలోని మామిడిగూడెం, దేవరపల్లి, పెద్దిపల్లి,గొల్లగూడెం, తేగడ, కొత్తగట్ల, గణేశ్‌నగర్‌లలో వైద్య సిబ్బంది మంగళవారం ర్యాపిడ్ ఫీవర్ సర్వేలు నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలను తొలగించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, జ్వరాలు సోకితే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి రావాలని అన్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- ప్రభావిత గ్రామాల పరిశీలనలో అధికారుల సూచనలు



దుమ్ముగూడెం: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఎస్పీ అంకిత్ కుమార్



పినపాక: అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ సూర్యనారాయణ

దుమ్ముగూడెం: గోదావరి వరదల సమయంలో ముంపు ప్రాంతాల ప్రజలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ ప్రజలకు సూచించారు. మంగళవారం గోదావరి వరద ముంపు గ్రామాలైన సున్నంబట్టి, పర్ణశాల సీతవాగు, తూరుబాక వంతెన దగ్గర గోదావరి ఉధృతిని ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామస్తులు, అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ బి.అశోక్, సిబ్బంది ఉన్నారు.

పినపాక: మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతాలలో వరద పరిస్థితి, ప్రభావిత గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యలపై మండల అధికారులు దృష్టి సారించాలని తహసీల్దార్ సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమక్ష సమావేశం నిర్వహించారు. గోదావరి 50 అడుగులు దాటి ప్రవహిస్తున్న నేపథ్యంలో మండలంలోని ముంపు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పర్యటించి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు, ఆహారం, తాగునీరు, వంటి కనీస సౌకర్యాల కల్పనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్, పంచాయతీరాజ్ డీఈలు రమేష్ బాబు, సైదులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘లహరి’ని సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ డిపోకు సంస్థ కేటాయించిన లహరి ఏసీ సర్వీసులను ఏజెన్సీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ అన్నారు. భద్రాచలం డిపోకు కేటాయించి రెండు బస్సుల్లో భద్రాచలం నుంచి హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్ వరకు సర్వీస్ ఉన్న ఒక బస్సును ఆయన మంగళవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ తిరుపతి, ఆర్టీసీ సీఐ గౌతమి, స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వారోత్సవాలు

భద్రాచలం ఆర్టీసీ డిపోలో ప్రమాదాలను నివారించేందుకు వారం రోజుల ప్రమాద రహిత వారోత్సవాలను నేటి నుంచి నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ తిరుపతి తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో తరుచు ప్రమాదాలు చేసే డ్రైవర్లలో 45 ఏళ్ల దాటిన వారికి మూడేళ్లకోసారి, 45 ఏళ్ల కంటే తక్కువ ఉన్నవారికి ఏడాదికోసారి టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రైవర్లతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. చివరి రోజు ప్రమాద రహితంగా విధులు నిర్వహించిన డ్రైవర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్టీసీ సీఐ గౌతమి, స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



లహరి ఏసీ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావ్

చంద్రశేఖర్ ఆశయ సాధనకు పోరాడుదాం

దుమ్ముగూడెం: రాయల చంద్రశేఖర్ ఆశయ సాధన కోసం పోరాడుదాం అని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకురాలు కల్పన పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని రామచంద్రుని పేట గ్రామంలో రాయల చంద్రశేఖర్ సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.. రాయల చంద్రశేఖర్ విద్యార్థి దశ నుంచి 50 సంవత్సరాలు ప్రజల కోసం ప్రజా సమస్యల కోసం పోరాడారని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సాయన్న, కల్లూరు వెంకటేశ్వర్లు,వెంకట నరసమ్మ, కుమారి, వీరభద్రం, దశరాజు, లక్ష్మీదేవి, ముత్యాలక్క, గంగరాజు, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: ఇటీవలే జరిగిన రైల్వే ప్రమాదంలో మరణించిన, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ నాయకులు రాయల చంద్రశేఖర్‌కు మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం మండలంలోని పార్కలగండి, గండుగులపల్లి, జమేదారుబంజర, కొత్తూరు గ్రామాల్లో రాయల చంద్రశేఖర్ చిత్రపటానికి పూలతో నివాళులర్పించి, సంతాప సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి అమర్లపూడి రాము మాట్లాడుతూ.. చంద్రశేఖర్ మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో కుర్సం ముత్యాలరావు, కాకా వెంకటేష్, పండూరి వీరబాబు, బండి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ నాయకులు, కేంద్ర కంట్రోల్ కమిటీ చైర్మన్ రాయల చంద్రశేఖర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతుగంటి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ముత్యాలంపాడు గ్రామకమిటీ అధ్యక్షుడు ఈసం అశోక్ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన సంతాపసభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. తొలుత చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. పార్టీ జిల్లా నాయకులు కల్లూరి కిషోర్, మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ, కల్లూరి పద్మ, ఈసం బాబూరావు, కారం బాలరాజు మాట్లాడుతూ .. చంద్రశేఖర్ సేవలను కొనియాడారు. గ్రామకమిటీ నాయకులు పొడియం రాజు, ఈసం శివ, రామకృష్ణ, విజయ్, మడకం నాగేశ్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సోయం ప్రసాద్

దమ్మపేట: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశాన్ని ఎంపీపీ సోయం ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించగా.. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రతలో నిర్లక్ష్యం వహించరాదని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. త్వరలో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల, పదవీకాలం ముగియనున్న సందర్భంగా వారిని, అధికారులు మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ రవీంద్రనాథ్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు సమస్యపై ఆందోళన

బూర్గంపాడు: గోదావరి వరదలతో ఏటా ముంపుకు గురవుతున్న గ్రామాల ప్రజల గోడును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలేశాయని అఖిలపక్ష నాయకులు మంగళవారం బూర్గంపాడు ప్రధాన కూడలిలో ఆందోళన చేపట్టారు. బూర్గంపాడు మండలంలోని బూర్గంపాడు, సారపాక, నాగినేనిప్రోలు, మోతె, ఇరవెండి గ్రామపంచాయతీలు ఏటా గోదావరి వరద ముంపుకు గురవుతున్నాయని, ఈ గ్రామాల ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని అఖిలపక్ష నాయకులు ఆందోళన చేశారు. బూర్గంపాడు వైపు గోదావరికి కరకట్టలు నిర్మించాలని, లేకుంటే నష్ట పరిహార ప్యాకేజీని అందించాలని కోరారు. మెరక ప్రాంతాలలో శాశ్వత ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పోలవరం బ్యాక్‌వాటర్‌తో నష్టపోతున్న బూర్గంపాడు మండల ముంపు గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారం చూపాలన్నారు. అనంతరం తహసీల్దార్ ముజాహిద్‌కు వినతిపత్రం అందజేశారు. ఆందోళన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, భద్రాద్రి పరిరక్షణ సమితి అధ్యక్షులు బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, అఖిలపక్ష నాయకులు కేవీ రమణ, బిక్కసాని శ్రీనివాసరావు, జలగం జగదీష్, బిజ్జం శ్రీనివాసరెడ్డి, దామెర శ్రీనివాస్, బత్తుల వెంకటేశ్వర్లు, కొనకంచి శ్రీనివాస్, చుక్కపల్లి బాలాజీ, భూపెల్లి నర్సింహారావు,తాళ్లూరి జగదీశ్వరరావు,లక్కోజు విష్ణువర్ధన్, సోహైల్‌పాషా, రాయల వెంకటేశ్వర్లు, గూడురు వెంకన్న,మాడిశెట్టి లక్ష్మణ్, లైక్ పాషా తదితరులు పాల్గొన్నారు.



బూర్గంపాడు ప్రధానకూడలిలో ఆందోళన చేస్తున్న అఖిలపక్షం నాయకులు

తహసీల్దార్ బదిలీ

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌ను సిద్దిపేట జిల్లాకు బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులను మంగళవారం జారీ చేశారు. ఆయన స్థానంలో భద్రాచలం డిప్యూటీ తహసీల్దార్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఐటీఐ ప్రిన్సిపాల్‌గా ధర్మాచారి

బూర్గంపాడు: కృష్ణసాగర్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్‌గా ధర్మాచారి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన లక్ష్మణ్‌కు కాజీపేటకు బదిలీ అయింది. ఆయన స్థానంలో బదిలీపై వచ్చిన ధర్మాచారి బాధ్యతలు స్వీకరించారు.

మళ్లీ విజృంభిస్తున్న డెంగీ

చర్లరూరల్: ఏజెన్సీ ప్రాంతమైన చర్ల మండలంలో డెంగీ మళ్లీ విజృంభిస్తోంది. కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురిసి గోదావరి పెరిగి.. ప్రస్తుతం తగ్గుముఖం పట్టడంతో గ్రామల్లోని జనం జ్వరాలతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. చర్ల సీహెచ్‌సీకి ప్రతీరోజు సమారు 200 మంది వరకు వచ్చి వైద్య చికిత్సలు చేయించుకుంటున్నారు.

వ్యక్తి అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: ఓ వ్యక్తి కానరాకుండా పోవడంతో ఆయన కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై యాకూబ్ అలీ తెలిపారు. మండలంలోని అనంతారానికి చెందిన కుర్సం వరప్రసాద్ ఈనెల 8వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆయన భార్య కుమారి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

అశ్వాపురం: మండల కేంద్రంలో ఓం శక్తి పంక్షన్ హాల్‌లో జరిగిన ఏఐటీయూసీ మండల మహాసభలో గురువారం ఏఐటీయూసీ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా జక్కుల రాంచందర్‌రావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రాయపూడి రాజేష్, ఏడెల్లి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లె మోహన్, ఉపాధ్యక్షులుగా సర్వ కృష్ణ, ధరావత్ రాంబాబు, లంకెల లింగరాజు, ఉప ప్రధాన కార్యదర్శి మైలపుర సురేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా కోరెం శ్రీలత, సాదం యాదగిరిరెడ్డి, నవీన్, ఇందిర, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా బాగోతపు సతీష్, క్రాంతిరెడ్డికిరణ్‌రెడ్డి, మంగతయారు, ప్రచార కార్యదర్శులుగా నరసింహారావు, బాబురావులు కలిపి మొత్తం 30 మంది కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విచారణ చేపట్టాలి

అశ్వారావుపేటరూరల్: మండలంలోనిపెదవాగు ప్రాజెక్టుకు గండి పడిన ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన నీటి పారుదల శాఖ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా డిమాండ్ చేశారు. అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద పెదవాగు ప్రాజెక్టుకు గండిపడిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. నాయకులు ముత్యాల విశ్వనాథ్, వెంకటేశ్వరరావు, ఎస్‌డీ.సలీం, చెన్నయ్య, సైదా, రాజు, శ్రీను, జాకీర్, విజయ్ పాల్గొన్నారు.

హక్కు పత్రాలు ఇవ్వాలి

చర్ల: గిరిజనుల సాగులో ఉన్న పోడుభూములన్నింటికీ హక్కుపత్రాలివ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో గిరిజనులు మంగళవారం చర్లలో ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉపేందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మంగళవారం పలు గ్రామాలకు చెందిన పోడు గిరిజనులు చర్లలోని అటవీశాఖ రేంజ్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. రేంజ్ అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల సబ్ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్, పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు ఇర్పా సమ్మక్క, మంగమ్మ, నాయకులు పాల్గొన్నారు.

వరదతో నిలిచిన రాకపోకలు

అశ్వాపురం: గోదావరి వరదతో మండల పరిధిలోని అమ్మగారిపల్లి-అమెర్ద, మొండికుంట-భద్రాచలం రహదారిపై గరిఒడ్డు వద్ద మంగళవారం రాకపోకలు నిలిచాయి. అమ్మగారిపల్లి, అమెర్ద గ్రామాల్లో పంట పొలాలకు వరదనీరు చేరింది. సాయంత్రానికి గోదావరి తగ్గుముఖం పట్టింది.

దుమ్ముగూడెం: మండలంలో కురిసిన వర్షాలతో పాటు ఎగువ ప్రాంతం నుంచి గోదావరికి వస్తున్న వరద నీరు తగ్గడంతో గోదావరి తగ్గుముఖం పట్టింది. సున్నంబట్టి-బైరాగులపాడు గ్రామాలకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచల-చర్ల ప్రధాన రహదారిపైకి తూరుబాక దగ్గర వరద నీరు రహదారిపైకి చేరడంతో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి వరద తగ్గడంతో తిరిగి రాకపోకలు ప్రారంభమయ్యాయి. అలాగే పర్ణశాల నార చీరల ప్రాంతం ఇంకా నీటమునిగే ఉంది.



అశ్వాపురం: గరిఒడ్డు వద్ద మొండికుంట-భద్రాచలం రహదారిపై నిలిచిన వరద

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

చండ్రుగొండ: ఎలాంటి షరతులూ లేకుండా రైతుల రుణాలు మాఫీ చేయాలని వైస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం రైతులతో కలిసి సొసైటీ ఎదుట ధర్నా నిర్వహించగా ఆయన మాట్లాడారు. గానుగపాడు సొసైటీలో 2,500 మంది రూ.లక్షలోపు రుణం తీసుకున్న రైతులు ఉంటే 500 మందికి, గుంపెన సొసైటీ పరిధిలో 1,800 మందికి గాను 300 మందికే మాఫీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం సొసైటీ చైర్మన్ చెవుల చందర్‌రావుకు వినతిపత్రం అందించారు. నాయకులు భూపతి రమేష్, కన్నయ్య, తుపాకుల రాజు, పిచ్చయ్య పాల్గొన్నారు. కాగా, పట్టా పుస్తకాలు ఉన్నవారే కాక పహాణీలపై రుణాలు తీసుకున్న రైతులకూ మాఫీ వర్తింపచేయాలని న్యూడెమొక్రసీ నాయకుడు ఎస్‌కె.ఉమర్ డిమాండ్ చేశారు. చండ్రుగొండలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడగా నాయకులు వరికూటి వెంకట్రావు, కారం వెంకటేశ్, కే తిరుపతిరావు, డి.బాలు, టి.భీముడు, తోలెం వెంకటేశ్వర్లు, వెంకన్న, బాబురావు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: నిబంధనలతో నిమిత్తం లేకుండా ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఊకే నారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని తొట్టిపంపు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నారాయణ మాట్లాడుతూ.. నిబంధనల పేరుతో కొద్దిమందికి మాత్రమే రుణమాఫీ చేసిన ప్రభుత్వం సంబురాలు చేసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీను, కేశవరావు, రవి, వీరయ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో ‘శిక్షా సప్తాహ్’



కరకగూడెం: బోధన ఉపకరణాలు చూపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయురాలు

కరకగూడెం: ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన ‘శిక్షా సప్తాహ్’ కార్యక్రమం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం రెండో రోజు కొనసాగింది. కరకగూడెం జెడ్పీ, ఎంపీపీఎస్ పాఠశాలలో స్టోరీ టెల్లింగ్, పాఠశాలలో అమలు చేస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమానికి సంబంధించి ఉపాధ్యాయుల బోధన పద్ధతులు, ఉపకరణాలు ప్రదర్శించి సెమినార్లు నిర్వహించినట్లు పాఠశాల హెచ్‌ఎం మంజులా తెలిపారు. అంతేకాకుండా రోజుకో అంశం చొప్పున క్రీడలు, మొక్కల పెంపకం, సాంస్కృతిక ప్రదర్శనలు, చారిత్రక కట్టడాలు, పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాలు విద్యార్థుల్లో నైతికత పెంపొందించేలా ఉన్నాయని అన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై సర్వే

మణుగూరురూరల్: ప్రాథమిక ఆరోగ కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ సూచనల మేరకు మంగళవారం వైద్యసిబ్బంది పలు గ్రామాల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై సర్వే చేశారు. ఇళ్లల్లో నీరు నిల్వ ఉన్న కంటైనర్లను, సీసాలను, తొట్లను, కొబ్బరిబొండాలను శుభ్రం చేయించారు. పరిసరాలను పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సత్తెమ్మ, స్వరూప, రాంప్రసాద్, వెంకటలక్ష్మి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

దమ్మపేట: గ్రామ దీపికల వేతనాలు పెంచి, సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని గండుగులపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామ దీపికలు వినతిపత్రం అందజేశారు. పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో విధులను నిర్వర్తిస్తున్న గ్రామదీపికలకు కనీసవేతనంగా రూ.26,000లు ప్రకటించి, ఉద్యోగ, ఆరోగ్య భద్రత వంటి సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, అరుణ, శ్రీలత, వెంకటమ్మ, కృష్ణవేణి, సమీం తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

బూర్గంపాడు: గోదావరి వరద ముంపు బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా కోరారు. బూర్గంపాడు మండలంలోని వరద ముంపు ప్రాంతాల్లో మంగళవారం సీపీఐ అనుబంధ జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు ముత్యాల విశ్వనాథంతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదావరి వరదలతో ఇళ్లు, పంటచేలు నీటమునుగుతున్నాయని, వారికి శాశ్వత పరిష్కారం చూపే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మువ్వా వెంకటేశ్వరరావు, ఆలవాల సీతారామిరెడ్డి, సుబ్బారెడ్డి, నలజాల సత్యనారాయణ, పేరాల శ్రీనివాస్, ముదిగొండ బాలకృష్ణ, తోకల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వితరణ

గుండాల: మండలంలోని పోతిరెడ్డి గూడెం, జగ్గాయిగూడెం ప్రాథమిక పాఠశాలలకు మంగళవారం సీపీ సీడ్స్, వాసవీక్లబ్ ఆధ్వర్యంలో బల్లాలు, కంపాక్స్, వాటర్‌ఫిల్టర్‌లు వితరణ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కృష్ణయ్య, వాసవీ క్లబ్ గ్రీన్‌ఫీల్డ్ మండల అధ్యక్షుడు మానాల వెంకటేశ్వర్లు, సీపీ సీడ్స్ రాష్ట్ర ఇన్‌చార్జ్ రాజశేఖర్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా బడికి పంపాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సీపీ కంపెనీ వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వాగబోయిన రామక్క, పుల్లఖండం ఉపేందర్, అనుమోలు వెంకటేశ్వర్లు, మానాల ప్రవీత్, పొంబోయిన ముత్తయ్య, వూకె. బాబు, సుధాకర్, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో, ఎర్రగుంట ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలు రకాల అనారోగ్య బాధితలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు ప్రియాంక మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యగా, దోమల పెరుగుదలను అరికట్టాలని అన్నారు. అనంతరం ప్రైవేటు రక్త పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి, తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

సున్నంబట్టిలో..

దుమ్ముగూడెం: మండలంలోని గోదావరి వరద ముంపు గ్రామం సున్నంబట్టిలో దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. యాంటిలార్వా సర్వే, డ్రైడే కార్యక్రమం, ఇంటింటి సర్వేను నిర్వహించారు. అనంతరం గ్రామంలోని 59మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో మొబైల్ టీం డాక్టర్ నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికుంటలో..

చండ్రుగొండ: మండలంలోని బాలికుంట గ్రామంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులను పరీక్షించి అవసరం ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కనకం తనుజ మాట్లాడుతూ.. వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతను పాటించాలని సూచించారు.



కరకగూడెం: ఆశ్రమ పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న వైద్యాధికారి మధు

కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ యండి.ఇమాం, సిబ్బంది సుమతి, పద్మ, సుజాత, శ్రీనివాస్, ఆశ ర్కర్లు రాజేశ్వరి, నాగమణి, కుమారి పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో..

కరకగూడెం: మండల పరిధిలోని చిరుమళ్ల గిరిజన ఆశ్రమ పాఠశాలలో కరకగూడెం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. వైద్యాధికారి మధు సుమారు 220 మంది విద్యార్థులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం పాఠశాలలో కలియ తిరుగుతూ నీరు నిల్వ లేకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం జగన్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్‌ఎం రమాదేవి, పంచాయతీ సెక్రెటరీ రామకృష్ణ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.